క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు తూబాడు, చిరుమామిళ్ల, జంగాలపల్లె, సంకురాత్రిపాడు, గొరిజవోలు, గ్రామ పరిధిలోని పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

డాక్టర్ జయహరీష్‌కు సత్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని డైమండ్ టవర్స్‌లో నివాసం ఉంటున్న గూండా నరసింహారావు చిన్న కుమారుడు జయహరీష్ భారత దేశంలో నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ పల్మనాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా శ్రీ పుట్టబత్తుని ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ జయహరీష్‌ని దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ ననిశెట్టి వెంకట సుబ్రహ్మణ్య అప్పారావు, గుడిపాటి బాలరావు, ట్రెజరర్ కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, మహిళా భక్తులు అన్నపూర్ణమ్మ, వరలక్ష్మి, కుమారి, శ్రీలక్ష్మి, రోహిణి పాల్గొన్నారు.

వేల్పూరు కళాశాలలో ఆరంభమైన తరగతులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన జూనియర్ కళాశాలలో (కోఎడ్యుకేషన్) బాలురు–బాలికలకు ప్రవేశం ఉందన్నారు. ఎంపీసీ, బైపీసీ సీఈసీ గ్రూపులకు సంబంధించిన తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఓపెన్ టెన్త్ పాసైన వారు కూడా రెగ్యులర్ ఇంటర్మీడియట్‌కు అర్హులనీ, ఎటువంటి ఫీజు లేదన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. నూతన కళాశాల అడ్మిషన్లపై ప్రత్యేకంగా మైకుల ద్వారా ప్రచారంతో పాటు కరపత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పీడీ కాకుమాను రాజేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిరంతరాయం సాగాలి

రొంపిచర్ల: రోజుకు 24 గంటలూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూటికి నూరు శాతం బిల్లులు వసూలు చేయాలన్నారు. మరమ్మతులు వచ్చిన మీటర్లను మార్చటం, నూతన కనెక్షన్లు అందజేయాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో వచ్చే లోపాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ పి.రామిరెడ్డి, డెపూటీ ఇంజనీరు బి.వెంకటేశ్వరరెడ్డి, నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, మండలాల ఏఇలు, రెవెన్యూ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలుదారు హక్కుపత్రం జారీ విధి విధానాలపై సమావేశం

యడ్లపాడు: కౌలుదారు హక్కుపత్రం జారీ విధి విధానాలపై యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండల డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్యామలత, మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత ఆధ్వర్యంలో వీఆర్వో, ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు ఏర్పాటు చేశారు. 2024–25 సీసీఆర్‌సీ (కౌలుదారు హక్కుపత్రం) జారీ చేయుటకు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి భూ యజమాని అనుమతి తప్పనిసరి అన్నారు. 11 నెలల గరిష్ఠ కాల పరిమితితో ఉండే ఈ పత్రం ద్వారా ప్రభుత్వం ద్వారా అందించే వ్యవసాయ పథకాలు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు వంటి వాటిని పొందేందుకు కౌలుసాగు చేసే రైతులకు ఎంతో దోహదపడుతుందన్నారు. అలాగే ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రం వద్ద దీనిపై అవగాహన కల్పించి భూ యజమానులకు, కౌలుదారులకు చైతన్యం చేయాలన్నారు. గతంలో కౌలుదారు హక్కుపత్రం పొందిన వారి రెన్యువల్‌తో పాటు కొత్తగా కౌలు సాగు చేపట్టిన వారిని కూడా ప్రోత్సహించాలని కోరారు. కౌలుదారు హక్కుపత్రం పొందేందుకు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, నకళ్లు, పాస్‌పోర్టుసైజు ఫోటో, ఒప్పందం పై భూ యజమాని, కౌలుదారుని సంతకాలు చేసిన వాటిని వీఆర్వో లేదా ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు.

కౌలు గుర్తింపు కార్డులపై సమీక్ష

క్రోసూరు: క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో కౌలు గుర్తింపు కార్డుల జారీపై వీఆర్వోలతో సమీక్ష ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డుల జారీపై తీసుకోవాల్సిన విధి విధానాలను ఏవో వివరించారు. బుధవారం రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, తహసీల్దార్ ఎం.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు పెరుగుతున్న విద్యార్థులు

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2023–24 విద్యా సంవత్సరం నాటికి 2346 మంది నమోదైనట్లు చెప్పారు. 2024–25 నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల సముదాయాల వారీగా శావల్యాపురం -44, మతుకుమల్లి-38, కారుమంచి-32, వేల్పూరు-41 మంది నూతన విద్యార్థులు ఆయా పాఠశాలల పరిధిలో అడ్మిషన్లు తీసుకొని పాఠశాలల్లో చేరినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల తల్లిదండ్రులతో వారి ఇళ్లకు వెళ్ళి మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాలు ఉపాధ్యాయుల బోధన తీరు వివరించాలన్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ సిబ్బంది బోయపాటి తివిక్రమ్, లింగాల శ్రీహరి, మస్తాన్ రావులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్చాలి



చిన్నారులకు సర్టిఫికెట్లను అందిజేస్తున్న ఐసీడీఎస్ పీడీ కె.ఉమారాణి

యడ్లపాడు: చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పల్నాడు జిల్లా పీడీ కె.ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిమ్మాపురం–1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో 5–6 సంవత్సరాల పిల్లలకు పీపీ–1,2 విద్యను పూర్తి చేసిన సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. అనంతరం పిల్లలను గ్రామంలోని మండల (ఎల్ఈ) ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి.శాంతకుమారి, ఏసీడీపీవో బి.నిర్మలారాణి, సూపర్‌వైజర్ కె వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు రాణీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

గొంతువాపు నివారణకు ఉచిత టీకా

శావల్యాపురం: మండలంలోని అన్నీ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ సారథ్యంలో పశువులకు గొంతు వాపు నివారణకు ఉచితంగా టీకా చేస్తున్నట్లు కారుమంచి సెక్టారు పశువైద్యాధికారి సోముల గుణధీర్ మంగళవారం తెలిపారు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సుమారు 6 వేలు పశువులు ఉండగా ఇప్పటి వరకు 2500 పశువులకు టీకా చేసినట్లు ఆయన చెప్పా రు. దూడలు, పడ్డాలకు మాత్రమే గొంతు వాపు వ్యాధి వస్తుందని, వర్షాకాలంలో పచ్చగా మొలిచిన గడ్డి, మెత్తటి మట్టి రెండు తినటం ఈవ్యాధి సోకుతుందన్నారు. కొత్తనీరు తాగటం వలన గురక (గొంతు వాపు) వ్యాధి వస్తుందన్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో గొంతు వాపు వ్యాధి అధికంగా ప్రబలతోందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గొంతు వాపు టీకాలు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. సకాలంలో చికిత్స అందకపోతే పశువులు మృత్యువాత పడతాయన్నారు. పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: గుర్తింపు కార్డులు పొందగోరే కౌలు రైతులు వీఆర్వోల వద్ద లేదా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. నాదెండ్ల మండల పరిధిలో 16 సచివాలయాల్లో 2838 మందికి కౌలు రైతు కార్డులు అందజేయాలనే లక్ష్యంగా ఉందన్నారు. మండల పరిధిలో 35407 ఎకరాల సాగు భూమి ఉండగా, 17099 మంది రైతులున్నట్లు తెలిపారు. గతంలో కార్డులు తీసుకున్న కౌలు రైతులు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. నూతనంగా తీసుకోవాల్సిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డుతో పాటు పొలం యజమాని సంతకంతో కూడిన పాసుపుస్తకం జిరాక్సు కాపీ అందించాలన్నారు. ఇది 11 నెలల వ్యవధి వరకూ పని చేస్తుందన్నారు. మండలంలోని ఎండుగుంపాలెంలో 36, ఇర్లపాడు 309, చందవరం 221, గణపవరం–1వ సచివాలయంలో 46, 2లో 41, 3లో 29, 4లో 33, గొరిజవోలు 36, కనపర్రు 401, సంకురాత్రిపాడు 108, సాతులూరు–1లో 250, 2లో 230, తూబాడు 265, నాదెండ్ల–1లో 300, 2లో 367, చిరుమామిళ్ళ 166 కార్డులు పంపిణీ లక్ష్యంగా ఉందన్నారు.

వినుకొండలో అన్నదానం, మజ్జిగ పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): భగవాన్ రామదూత స్వామి పుట్టిన రోజు, షష్టిపూర్తి సందర్భంగా స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే కూరగాయల మార్కెట్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమ్ములదిన్నె ఆంజనేయులు, సామ్రాజ్యం, విజయేంద్ర, రమేష్ బాబు, ఆర్మీ చినవెంకన్న, ఆంజనేయులు, కోటయ్య పాల్గొన్నారు.

శావల్యాపురం సొసైటీ ఉద్యోగుల్లో హర్షం



సీఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

శావల్యాపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఉమ్మడి గుంటూరు జిల్లాల స్థాయిలో శావల్యాపురం మండలానికి రెండు పదవులు దక్కాయి. దీంతో సొసైటీ ఉద్యోగులు నూతన కార్యవర్గ అభినందనలు వెల్లువెత్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో పల్నాడు, గుంటూరు, బాపట్ల పరిధిలో 600 మంది సహకార ఉద్యోగులు మహాజన సభలో జరిగిన సదస్సులో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈక్రమంలో పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కారుమంచి సొసైటీకి చెందిన సీఈవో వై.వి.నారాయణకు ప్రధాన కార్యదర్శిగా, శావల్యాపురం సొసైటీ సీఈవో జాలాది నాగ ప్రసాదులను ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా సొసైటీ ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి.నారాయణ మాట్లాడుతూ సహకార సంఘల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను డిపార్టుమెంటల్ అధికారులు జిల్లా బ్యాంకు అధికారులకు దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లా సొసైటీ ఉద్యోగుల సెక్రటరీ ఈపూరు సొసైటీ సీఈవో పోకా కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. అనంతరం గుంటూరు జిల్లా సొసైటీ బ్యాంకు సీఈవో కృష్ణవేణిని నూతన కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రైతులకు కిసాన్ యోజన పథకం నగదు జమ



వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు రైతులు

శావల్యాపురం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్ యోజన పథకంలో నిధులకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 17వ విడత పీఎం కిసాన్ నిధులు అర్హత కల్గియున్న ఒక్కో రైతుకు రూ.2 వేల రూపాయలు చొప్పున 5345 మంది రైతులకు రూ. ఒక కోటి 69 లక్షల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఏఈవో పురేటి అశోక్, వీఏఏ వెంకాయమ్మ రైతులు పాల్గొన్నారు.

ప్రముఖ ముస్లిం మత గురువు అస్తమయం

ఆరున్నర దశాబ్దాలకు పైగా ధార్మిక బోధనలు



భౌతిక కాయం వద్ద దువా చేస్తున్న పీఠాధిపతులు అతావుర్ రెహమాన్, షాజిద్ రెహమాన్

చిలకలూరిపేట(యడ్లపాడు): సేవా, ధార్మిక రంగాల్లో ప్రసిద్ధి చెందిన ముస్లింల మతగురువు హజరత్ మొహమ్మద్ ముక్తరుల్లాషా ఆమెరి (87) బక్రీద్ పర్వదినం సోమవారం రాత్రి 11 గంటలకు పరమపదించారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన ఆయన 72 ఏళ్లుగా ఆర్ఎంపీగా, 66 ఏళ్లుగా ధార్మిక రంగాల్లో అత్యుత్తమ సేవలను అందించిన ఎందరో నిరుపేద కుటుంబాలకు స్వాంతన చేకూర్చారు మంగళవారం ఆయన భౌతికకాయాన్ని వీక్షించేందుకు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. ఆయనకు 14 మంది సంతానం కాగా వారిలో ఆరుగురు కుమారులు, 8 మంది కుమార్తెలు ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులంతా వెరిసి ప్రస్తుతం 120 మంది ఉండటం విశేషం. చిన్నపాటి ఫంక్షన్ చేసుకున్నా వీరి సమీప బంధువులే 1000 మంది కావడం గమనార్హం. మంగళవారం సాయంత్రం గ్రామంలోని జగనన్న కాలనీ ఎదురుగా ఉన్న తమ మసీదు ప్రాంగణంలోనే ఖననం చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతుల్లో ఒకరైన సయ్యద్ అతావుర్ రెహమాన్, షాజిద్ రెహమాన్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో పాటు పలువురు ముస్లిం పెద్దలు హాజరయ్యారు.

భారీగా పెరిగిన కూరగాయల ధరలు

- స్థానికంగా తగ్గిన ఉత్పత్తి
- సరఫరా కూడా అంతంత మాత్రమే



కూరగాయలు



పచ్చిమిర్చి

సత్తెనపల్లి: కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రత, నీటి లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడం వంటి కారణాలతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. రవాణా, ఇతర చార్జీలు, కొరత వంటి కారణాలతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాటా, బెండ, దొండ, వంకాయలు, పచ్చిమిర్చి, బీరకాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. డిమాండ్‌కు అనుగుణంగా సరుకు దిగుమతి కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అందుబాటులో ఉన్న ధరలు ఇప్పుడు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్థానికంగా తగ్గిన ఉత్పత్తి

కూరగాయల సాగు స్థానికంగా తగ్గడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సత్తెనపల్లి పట్టణానికి కూరగాయలు ఎక్కువగా చుట్టుపక్కల 67 గ్రామాల నుంచి వస్తుంటాయి. ఇక్కడ నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తక్కువ మొత్తంలో వస్తుంటాయి.

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంటల సాగుకు అవసరమైన మొత్తంలో నీటి లభ్యత లేకపోవడంతో పలువురు రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. దీంతో బహిరంగ మార్కెట్‌కు దొండ, వంగ, బెండ తదితర ఉత్పత్తులు కొద్ది మొత్తంలో మాత్రమే వస్తున్నాయి. దీంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

బయట నుంచి సరఫరా

టమాటా, బీర, క్యాప్సికం, కాకర ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి టమాటాలు, బీరకాయలు, కాలీఫ్లవర్, క్యాప్సికం, బీన్స్ వంటివి సరఫరా అవుతున్నాయి. స్థానికంగా సాగు లేకపోవడంతో ఆ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రైతులు చెల్లించే దానికి మధ్యవర్తులు, రవాణా చార్జీలు తోడవడంతో ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. అలాగే పచ్చిమిర్చిని పులివెందుల, బద్వేలు, బాపట్ల, గిద్దలూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

సత్తెనపల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లో ధరలు ఇలా... (కిలో రూపాయలలో)

కూరగాయలు	మార్చి	మే	జూన్
టమాటా	25.00	50.00	80.00
వంకాయలు	40.00	60.00	70.00
బంగాళదుంపలు	30.00	40.00	50.00
బీరకాయలు	40.00	60.00	70.00
క్యాప్సికం	80.00	100.00	120.00
కాకరకాయలు	40.00	60.00	80.00
దొండకాయలు	30.00	40.00	50.00
సొరకాయ	15.00	25.00	30.00
గోరుచిక్కుడు	40.00	60.00	60.00
క్యాబేజి	30.00	40.00	40.00
క్యారెట్	50.00	60.00	60.00
పచ్చిమిర్చి	60.00	100.00	60.00

గ్రామాల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమం



ఇరికేపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి: నగర పంచాయతీతో పాటు గ్రామాల్లోనూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత విద్యను ప్రతి ఒక్కరు అందుకోవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అక్కడికక్కడే చిన్నారులకు అడ్మిషన్ రాసి బడిలో చేర్చుకుంటున్నారు. పిల్లలను బడికి పంపించకుండా పనికి పంపిస్తే ప్రభుత్వం తీసుకునే చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు నాగెండ్ల ఏసయ్య, చెట్టిపోగు ఏసురత్నం, వట్టిపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

23 వేల పాఠ్యపుస్తకాలు అందజేత

ఎంఈవో–2 శివనాగేశ్వరరావు



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో కార్యాలయ సిబ్బంది

రెంటచింతల: మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలలకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు రెండు విడతలుగా 23 వేల పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వివిధ గ్రామాలలో ఉన్న మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మూడు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, 22 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న 3,862 మంది విద్యార్థులకు మొత్తం 32 వేల అచ్చు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 7వ తరగతి అచ్చు పుస్తకాలు రాలేదని మిగిలిన తరగతులకు సంబంధించి కొన్ని పాఠ్యపుస్తకాలు రావలసి ఉందని రెండు, మూడు రోజుల్లో మిగిలిన అచ్చుపుస్తకాలు రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నారు. 124 మంది ఉపాధ్యాయులకు గాను 100 మంది ఉపాధ్యాయులు ఉన్నారని మరో 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయని త్వరలో ఆ పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం

సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి మొఘల్ సుభాన్ బేగ్

అచ్చంపేట: అన్ని రకాల వ్యాధులు దోమలు, కలుషిత నీరు తాగడం వలన వస్తాయని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి మొఘల్ సుభాన్ బేగ్ అన్నారు. మలేరియా నిర్మూలన మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, బీసీ బాలికల వసతిగృహం, ఎస్టీ బాలుర వసతి గృహాలలో ఆయన మలాథియాన్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వసతి గృహాలలో మురుగు చేరకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు చెప్పారు. దోమల నిర్మూలనకు మలాథియన్ ద్రావణాన్ని పరిసరాలలో స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభమైనందున కుళాయిల వద్ద, తిన్న ప్లేట్లు కడుక్కునే ప్రదేశంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పంచాయతీ సహాయంతో రెండు మూడు రోజులకొకసారి బ్లీచింగ్ చల్లుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజేష్, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, రాధాకృష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, బాలికల పాఠశాల స్పెషల్ అధికారి జ్యోత్స్న దీప్తి, వార్డెన్స్ శైలజ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎం, ఎంసీపీఐ నాయకులు

పిడుగురాళ్ల: కామ్రేడ్ పున్నారావు 17వ సంస్మరణ సందర్భంగా జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాలను మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పీడీఎం, ఎం సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ గుంటూరు బ్రాడీపేట 2/7లో కొరిటాల భవనం(సీపీఎం పార్టీ కార్యాలయం)లో ఉదయం 10.30 గంటలకు సంస్మరణ సభ ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి వక్తలుగా విరసం పాణి, డేవిడ్, చిలుక చంద్రశేఖర్, వైవీలు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎం సీపీఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్, ఎం సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణానాయక్ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామ ఎంపీపీ(రామాపురంకాలనీ) పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు మొవ్వ సురేష్, కళ్యాణి, వేణుమాధవి, సతీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల తనిఖీ

పట్నంబజారు: విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని వాహనాలపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టి బస్సులపై కేసు నమోదు చేస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించిన 15 బస్సులు, 60 ఏళ్లపై బడి వాహనాలు నడుపుతున్న డ్రైవర్‌కు సంబంధించి ఒక కేసు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎస్‌పీ) లేనివి రెండు కేసులు కలిపి మొత్తం 18 కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలని డీటీసీ షేక్ కరీం కోరారు.

తొండపిలో 'నేను బడికిపోతా' కార్యక్రమం



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం మంగళవారం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలోనే మంచి భవిష్యత్ ఉంటుందని, పిల్లల భద్రత బడిలోనే ఉంటుందని, ప్రతి పిల్లవాడు బడిలోనే ఉండాలంటూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలు, వసతులను వివరిస్తూ బడిలో చేర్పించాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనులకు పంపించరాదని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.ఆదిలక్ష్మి, జేవీ రమణారావు, జి.భానుప్రకాష్, షేక్ బాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.